ప్రజాశక్తి
బుధవారం 7 మే 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





డ్రోన్ కెమెరాలతో నేరాలు నియంత్రణ : డిఎస్‌పి

ప్రజాశక్తి-కందుకూరు


శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలు, ట్రాఫిక్, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, విపత్తు నిర్వహణ, ఇతర పోలీసింగ్ అవసరాల కోసం ఇండో సోలార్ కంపెనీ వారు ఎస్‌పి సూచనలతో కందుకూరు డి.ఎస్.పి బాల సుబ్రమణ్యంకి మంగళవారం అత్యాధునిక సాంకేతికతతో కూడిన డ్రోన్ కెమెరాను అందజేశారు. కందుకూరు డివిజన్ పోలీస్ శాఖకు సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో ఒక డ్రోన్‌ను బహుకరించడం అభినందనీయమని డి.ఎస్.పి బాలసుబ్రమణ్యం వారికి కతజ్ఞతలు తెలిపారు. ఆ డ్రోన్‌ను గుడ్లూరు సర్కిల్ ఆఫీసుకు డిఎస్‌పి అందచేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం నేరాల నియంత్రణలో, శాంతిభద్రతల పరిరక్షణలో అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సిబ్బందికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు సర్కిల్ సిఐ మంగ రావు , ఎస్ఐ, వెంకట్రావు పాల్గొని ఇండో సోలార్ యాజమాన్యానికి కతజ్ఞతలు తెలిపారు.



‘గౌరవం’ లేదు..‘వేతనం’ రాదు..!

- జెడ్‌పిటిసి, ఎంపిటిసిల ఆవేదన
- రెండేళ్ల నుంచి నిరీక్షణ
- నిరుపేద ప్రజా ప్రతినిధులు ఆగ్రహం

ప్రభుత్వాలు స్థానిక ప్రజా ప్రతినిధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ఓట్లతో గెలిచి స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఉంటున్న వారికి సరైన గుర్తింపు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రతిపక్ష పార్టీల ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని తెలుస్తోంది. జిల్లాలో జెడ్‌పిటిసి, ఎంపిటిసిలకు రెండేళ్ల నుంచి గౌరవ వేతనం అందలేదు. ఆర్థికంగా బలంగా ఉన్న ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు లేకపోయినా ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేదలు మాత్రం అవస్థలు పడుతున్నారు. ఒక ఏడాది బడ్జెట్ కేటాయింపులు జరగ్గా, ఇప్పటికీ బిల్లులు అందలేదు. మరో ఏడాది అసలు బడ్జెట్ కేటాయింపులే జరగలేదని తెలిసింది. ఇది చిన్న విషయంలాగా కనిపిస్తున్నా నిరుపేద ప్రజా ప్రతినిధులను ఆర్థిక కష్టాల్లో పడేస్తుంది. ప్రభుత్వం వెంటనే గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతున్నారు..



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ప్రతినిధులకు ప్రతినెలా గౌరవ వేతనం అందిస్తుంది. అలవెన్స్‌లు ఇస్తుంది. ఎంపి, ఎంఎల్‌ఎలకు భారీగా గౌరవ వేతనం ఉంది. మండలాలు,గ్రామాల్లో ప్రజలకు దగ్గరగా జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు కలిసి పని చేస్తారు. ఎక్కువ సమయం ప్రజలతోనే ఉండడంతో వీరికి ప్రభుత్వం ప్రతి నెలా కొంత గౌరవ వేతనం అందిస్తోంది. జెడ్‌పి టిసిలకు ప్రతి నెలా రూ.6 వేలు, జెడ్‌పి ఛైర్ పర్సన్‌కు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ఎంపిటిసిలకు ప్రతినెలా రూ.3 వేలు, ఎంపిపికి రూ.6 గౌరవ వేతనంగా ఇస్తున్నారు. గతంలో జెడ్‌పి, మండల సమావేశాలు జరిగే సమయంలో ఖర్చులకు కొంత మొత్తం ఇచ్చేవారు. ఇటీవల దానిని పక్కన పెట్టేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జెడ్‌పిటిసిలు 46 మంది, ఎంపిటిసిలు 580 మంది, ఎంపిపిలు 46 మంది, జెడ్‌పి ఛైర్మన్ ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రిజర్వేషన్లు వల్లా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల నుంచి కూలీ పనులు చేసుకునే వ్యక్తులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసి ఆయ్యాక తెల్లని బట్టలతో రోజు కూలీలకు వెళ్లడం మానేశారు. నాయకులుగా రోజు ప్రజల్లో తిరుగుతున్నారు. కొందరు వ్యక్తులు ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ అత్యధిక మంది పేదలున్నారు. వీరికి ప్రతి నెలా ప్రభుత్వం నుంచి రూ. 6 వేలు కొంత చేయూతగా ఉంటుంది. ఇది కూడా రెండేళ్ల నుంచి అందకపోవడంతో పేద ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన జెడ్‌పి సమావేశాల్లోనూ తమ గౌరవ వేతనం గురించి ప్రస్తావించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ప్రతిపక్ష పార్టీలను గౌరవించడం లేదని తెలుస్తోంది. స్థానికంగా జరిగే కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని తెలుస్తోంది. జెడ్‌పి ఛైర్‌పర్సన్‌లను పట్టించు కోవడం లేదని తెలుస్తోంది. ఇదే విషయమై వైసిపి ప్రతినిధులు ప్రశ్నించారు.

రెండేళ్ల నుంచి గౌరవ వేతనం లేదు..!

జిల్లాలోని జెడ్‌పిటిసి, ఎంపిటిసిలకు రెండేళ్ల నుంచి గౌరవ వేతనం అందలేదు. ప్రభుత్వం దీని కోసం బడ్జెట్ కేటాయించిన తరువాత స్థానిక అధికారులు మూడు నెలలకోసారి బిల్లులు పెడతారు. ఒక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ఇందుకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వానికి వెళ్లగా సిఎఫ్ఎంఎస్ వద్ద పెండింగ్ పడినట్లు తెలిసింది. 2024 కు సంబంధించి మే - ఆగస్టు నాలుగు నెలలకు రూ.12,64,000 , 2023 సెప్టెంబర్ - ఏప్రిల్ కు సంబంధించి రూ.25,28,000 బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినా నిధులు మంజూరు చేయలేదు. మరో ఏడాదికి సంబంధించి అసలు బడ్జెట్ కేటాయింపులే జరగలేదని తెలిసింది. ఇది చూడడానికి చిన్న విషయంలా కనిపించినా, రాజకీయనేతలకు డబ్బులకు ఏం ఇబ్బందని కొందరు చెబుతున్నా అనేక మంది పేద ప్రజా ప్రతినిధులు గౌరవ వేతనం కోసం చూస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు గౌరవం లేదని, వేతనం కోసం ఎదురుచూడాల్సి ఉంటుందని స్థానిక ప్రజా ప్రతినిధుల ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం..మత్తుపదార్థాలను నిషేధించాలి

ఐద్వా, డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

యువత బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్న మద్యం.. మత్తు పదార్థాలను ప్రభుత్వం నిషేదించాలని ఐద్వా, డివైఎఫ్ఐ జిల్లా కమిటీలు డిమాండ్ చేశారు. మంగళవారం భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) సంయుక్తగా నగరంలో ప్రదర్శన నిర్వహించాయి. ఈ ప్రదర్శన జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నుంచి ముత్తుకూరు గేట్ సెంటర్ వరకు నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌భీ మాట్లాడుతూ యువత చిన్న వయస్సులోనే మత్తు పదార్థాలకు బానిసలు కావడం వల్ల నైతిక విలువలను విస్మరించి చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకున్నా క్షణికమైన ఆవేశానికి గురై మరణాయుధాలతో దాడులకు తెగబడుతున్నారన్నారు. ఈ కారణంగా నగరంలో శాంతి భద్రతలు క్షీణించిపోతున్నాయన్నారు. నెలలో రెండు, మూడు హత్యలు చోటు చేసుకుం టున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో నూతన మద్యం పాలసీని తీసుకొస్తామని ప్రకటించినప్పటికీ గతంలో ఉన్న మద్యం దుకాణాల కంటే మరో 800 మద్యం షాపులకు లైసెన్సులు ఈ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటుతుంటే వాటిని అధుపుచేయకుండా మద్యం రూ.99లకే అందజేస్తామంటూ కూటమి ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణ మాట్లాడుతూ జిల్లాలో మద్యం ఏరులై పారుతుందన్నారు. మద్యం, మాదకద్రవ్యాలు సేవించడం కలిగే అనర్థాలను యువతకు తెలియజేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన పోలీసులు ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న టీ అంగళ్లు, టిఫెన్ సెంటర్ల వద్ద యువత గుంపులు గుంపులుగా చేరి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో యువత విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి శివకుమారి, నగర కార్యదర్శికే పద్మ. రూరల్ అధ్యక్ష రాలు. ఎస్ వరలక్ష్మి శంషాద్ సంపూర్ణమ్మ. మూలి ప్రమీల. కె లక్ష్మమ్మ ఉన్నారు.



ధర్నా చేస్తున్న ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు

ఇళ్లు తొలగించడం దుర్మార్గం

పునరావాసం కల్పించకుండా

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు

నగర నియోజకవర్గం పరిధిలోని రైల్వే స్థలాలలో నివాసముంటున్న నిరుపేద కుటుంబాలకు నష్టపరిహారం,పునరావాసం కల్పించకుండా తొలగిస్తామని చెప్పడం తగదని, ఈ చర్యలు దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. మంగళవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు 52 వ డివిజన్ పరిధిలోని రైలు వీధిలో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్,నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. నగర నియోజకవర్గ పరిధిలోని 52వ డివిజన్ రంగనాయకులపేట రైలు వీధి ప్రాంతంలో గత 100 సంవత్సరాలకు పైగా నివాసం ఉన్న నిరుపేదల వద్దకు వందలాది మంది పోలీసులు రైల్వే అధికారులు దౌర్జన్యంగా వచ్చి ఇల్లు తొలగిస్తామని చెప్పడం సరికాదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఏ ప్రభుత్వ స్థలంలో నివాసం ఉన్నప్పటికీ వారికి నష్టపరిహారం పునరావాసం కల్పించకుండా ఇళ్లు తొలగించకూడదన్నారు. రైల్వే స్థలాలలో నివాసం ఉన్న బాధితులు అందరికీ పూర్తిస్థాయి విచారణ జరిపి నష్టపరిహారం పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో నిరుపేదలుగా ఉన్న ముస్లిం మైనారిటీలు, దళితులు నివాసముంటున్నారన్నారు. వారంతా బీడీ పని, పాచి పని, చిన్నచిన్న కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తారన్నారు. బలహీనుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగేశ్వరావు, నగర కమిటీ సభ్యులు షేక్. రషీద్, చిరంజీవి, శాఖ కార్యదర్శులు అమాన్, మట్టిపాటి శ్రీనివాసులు, సిపిఎం నాయకులు అలీ, అఖిల్ గణేష్ పాల్గొన్నారు



పేదల ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -రాపూరు : రాపూరులోని ఆర్‌టిసి డిపో ఎన్ఎంయు డిపో కార్యదర్శి ఎవి రమణయ్య ఉద్యోగులతో కలిసి రాపూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్టీసి ఉద్యో గుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టీసి ఉద్యో గుల సమస్యలపై నాలుగు నెలల కిందట యాజ మాన్యానికి వినతిపత్రం ఇచ్చినా పరిష్కరించలేదన్నారు.అధికారుల ద్వారానైనా ప్రభుత్వానికి తెలియజేయాలని తహశీల్దార్ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. సి సి ఎస్ డెలిగేట్ ఎస్ కె నిస్సార్ అహ్మద్ ఏ వి బాబు, డివి రామిరెడ్డి డి ఆనందరావు, ఎంఎం ఎస్ రావు, పెంచలయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలం చెమిడిదపాడుగ్రామ బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి ఆలయానికి గుడ్లూరు మండలం పొట్లూరు గ్రామానికి చెందిన కర్పూరపు రమేష్, ధర్మపత్ని సుమతి, కుటుంబ సభ్యులు వెన్నెల, వెంకట ఆదిత్య, జయమ్మలు రూ. 10,116 విరాళం అందజేశారు. మంగళవారం ఆలయ నిర్మాణ ప్రాంగణంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఆలూరి వెంకట హనుమంతరావు కు పోన్ పే ద్వారా ఆ మొత్తాన్ని రమేష్ పంపారు. ట్రస్ట్ తరపున హనుమంతరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పశువైద్యశాల ఉద్యోగిని బదిలీ

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : మండలంలోని పోకూరు పశువైద్యశాలలో లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బొప్పరాజు అనుపమ బదిలీపై వెళ్తున్నారు. ప్రకాశం జిల్లా మద్ది పాడు మండలం కొలసానకోట గ్రామీణ పశువైద్యశాలలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ గా పదోన్నతి లభించినట్లు అనుపమ తెలిపారు.

వడదెబ్బ నివారణకు చర్యలు

ప్రజాశక్తి -గుడ్లూరు : ప్రస్తుతం వేసవి కాలంలో మండలం లోని అన్ని గ్రామాల్లో ఆశా కార్యకర్తలు ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచుకుని ప్రజలు అందించాలని సిహెచ్ఒ భాస్కరరావు సూచించారు. వేసవి నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం సిబ్బందితో చర్చించారు. మండలంలో అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్ర మాలు గురించి చర్చించారు. వాచ్ఇఒ ఆరిఫ్, పిహెచ్ఎన్ వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-కందుకూరు : పొగాకు రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని ఎఐకెఎస్ జాతీయ సమితి సభ్యులు కుర్ర వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కందుకూరు పట్టణ పరిధిలోని దూబగుంట దగ్గర ఉన్న పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి పొగాకు ధరలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులకు సరైన ధర కల్పించకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని ఆయన అరోపించారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే రైతులకు న్యాయం చేస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని పట్టించుకోక పోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, నాయకులు యర్రంశెట్టి ఆనందమోహన్, చేవూరు దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



హామీలను అమలు చేయాలి : వైసిపి

ప్రజాశక్తి-కందుకూరు : కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదవుతున్నా వాగ్దానాల అమలులో విఫలమైందని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్ తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలన్నింటినీ తొలగించారని విమర్శించారు.ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

బోరుకు మరమ్మతులు చేయరూ..

ప్రజాశక్తి - సైదాపురం : సైదాపురం పరిధిలోని దాడిశెట్టిపల్లి,దళిత వాడ కాలనీలో కొద్దిరోజులుగా చేతి పంపు బోరు మరమ్మత్తుల గురైంది. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. మంచినీటి ఇబ్బందులు ఉన్నాయని, అధికారులు స్పందించి వేసవిని దష్టిలో ఉంచుకొని బోరుకు తక్షణమే మర మ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు.



కొనసాగిన మున్సిపల్ కార్మికుల ధర్నా

వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

అరవై ఏళ్లు నిండాయాయనే నెపంతో నగర పాలక సంస్థలో 93 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పనిలో నిలిపివేయడం అన్యాయమని ఎపి మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రెండో రోజు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, వారసులకు ఉద్యోగావశాలు కల్పించాలని మునిసిపల్ కార్పొరేషన్ కార్పొరేషన్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు నిరసన. ధర్నా కార్యక్రమం చేపట్టారు. ధర్నా అనంతరం నగర మేయర్, కమీషనర్ లకు అర్జీలను సమర్పించిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు,కార్మికులు అందజేశారు.ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నెల్లూరు నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ గత 30 ఏళ్లకు పైగా నెల్లూరు నగరపాలక సంస్థలో ప్రజల ఆరోగ్యాలను కాపాడుటకు మౌలిక సదుపాయాలు కల్పించుటకు కషి చేసిన కార్మికులను 60 ఏళ్లు నిండియాయనే నెపంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా నిర్దాక్షిణ్యంగా పని నుంచి నిలిపి వేయడం దారుణమన్నారు. ఆరోగ్యాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడిన మున్సిపల్ కార్మికుల పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కల్పించేంతవరకు పనిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్పందించిన నగర కమిషనర్ మేయర్ పరిస్థితి తీవ్రతను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సిఐటియు రూరల్ నాయకులు మాలకొండయ్య, సుధాకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం అశోక్,మట్టిపాటి శ్రీనివాసులు సుజాతమ్మ, మారుతి ఉన్నారు.



మేయర్‌తో చర్చిస్తున్న నాయకులు

కిశోర బాలిక వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : మండలంలోని బడేవారిపాలెం, నూకవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోరి బాలికల వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి కందుకూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఒ శర్మిష్ఠ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలు రుతుస్రావం సమయంలో పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సునీత, కార్యకర్తలు మధుల, సుమలత, ఏ ఎన్ ఎం లావణ్య అసిత ఉన్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : కిషోర్ వికాసం కార్యక్రమాన్ని గుడ్లూరు మండలంలోని గుడ్లూరు సెక్టార్ టు లోని రాళ్లపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్ వైజర్‌కామేశ్వరి మాట్లాడుతూ కిశోరి బాలికలు వ్యక్తిగత శుభ్రతను ఏ విధంగా పాటించాలో వివరించారు. నెలవారి రుతుక్రమ సమ యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్ గీత, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అర్బన్ బి సెక్టార్‌లోని కోటువారి స్ట్రీట్ ఒకటి ,పదకొండు నెంబర్ సచివాలయం పరిది లోని యానాది పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సి డి పి ఓ కే శర్మిష్ట ఆదేశాల మేరకు మంగళవారం కిషోర్ వికాసం ప్రోగ్రాం నిర్వహించారుకిషోర్ బాలికలకు రుతుక్రమంలో వాడే ఉత్పత్తులు వాడిన తర్వాత వాటిని పారవేసే పద్ధతులు,పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ ఎల్ లక్ష్మి దేవి. ఎమ్ ఎస్ కే పి అమత వాణి, ఆర్ పి బి శుభ శ్రీ.ఏ ఎన్ ఎమ్ బి స్రవంతి, అంగన్వాడీ కార్యకర్తలు బి పద్మావతి , బి నిర్మల పాల్గొన్నారు.



వలేటివారిపాలెంలో..

ఖాళీ బిందెలతో సిపిఎం నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు

రూరల్ నియోజకవర్గం పరిధిలోని 23,24 డివిజన్ల పరిధిలో మంచి నీటి సమస్యకు పరిష్కారం చూపించాలంటూ సుందరయ్య కాలనీ ప్రాంతంలోని సచివాలయం ఎదుట ప్రజలు ఖాళీ బిందెతో నిరసన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం ఉదయం సచివాలయం వద్దకు స్థానిక సిపిఎం శాఖల ఆధ్వర్యంలో స్థానికులు అధిక సంఖ్యలో చేరుకోని తమ దాహార్తిని తీర్చేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన రూరల్ సిపిఎం కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ కార్పోరేషన్ అధికారులు తమ ఖజానా నింపుకొనేందుకు ప్రజల నుంచి పన్నుల రూపంలో వేలాధి రూపాయలు వసూళ్లు చేయడంలో చూపిస్తున్న శ్రద్దలో కొద్దిగా ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన తాగునీటిని సరఫరా చేసేందుకు చూపించాలని హితవు పలికారు. తాగునీటి సమస్యకు కార్పోరేషన్ అధికారులు పరిష్కారంచూపించని పక్షంలో నగరంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో చివరగా సచివాలయం అధికారులకు వినతిపత్రం అందజేసి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని కోరారు. సిపిఎం శాఖ కార్యదర్శి కె.సురేష్, సిపిఎం మాజీ రూరల్ కమిటీ సభ్యులు వీర్ల శ్రీనివాసులు, పార్టీ సభ్యులు కె.సుబ్బారావు, అభిషేకం, చింతల మల్లికార్జున, వెంకమ్మ, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఆస్తమా నివారణకు ఆధునిక చికిత్సలు

ప్రజాశక్తి-నెల్లూరు : ఆస్తమా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఆస్తమా నివారణ కొరకు పిల్లలు, పెద్దలు ఇన్హేలర్ చికిత్సలను అందుబాటులో ఉంచుకోవాలని ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ సి.ప్రేమ్ దీప్ అన్నారు. మంగళవారం, స్థానిక జ్యోతినగర్ లోని రామ రాఘవయ్య ప్రథమ చికిత్సలాయం ఆవరణంలోకమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పి.యం.పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) బిలీవ్ మల్టీస్పెషాలిటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ సి.ప్రేమ్ దీప్, వైద్య శిబిరాన్ని ప్రారంభించిన విశ్రాంత వీఆర్వో దూడల వెంకయ్య మాట్లాడారు. పిహెచ్‌పి నాయకులు డాక్టర్ సి. ప్రేమ్ దీప్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, హాస్పిటల్స్ కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, జిల్లా పీ.హెచ్.పీ నాయకులు షేక్ సత్తార్, శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ఎం.శ్రీధర్ రావు, కె రామరాఘవయ్య, జాకీర్, నిస్సారు, పట్టాభిరామరెడ్డి ఉన్నారు.

నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ అండ్ స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ సుష్మితా రెడ్డి, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌషిక్ రెడ్డి. ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా మంగళవారం మెడికవర్ హాస్పిటల్ లో జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ సుష్మితా రెడ్డి, డాక్టర్ కౌషిక్ రెడ్డి మాట్లాడారు. మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, పల్మనాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది, పిఆర్వో చందు వర్మ పాల్గొన్నారు.

20న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఉలవపాడు : కార్మిక సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం 26000 ఇవ్వాలని, 4 లేబర్ కోట్లు చేయాలని కోరుతూ, మే 20వ తేదీన దేశవ్యాపితసమ్మె లో భాగంగా, మంగళ వారం ఉలవపాడు ప్రాజెక్టు స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో యూ.డి.సి మణికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఉలవపాడు ప్రాజెక్టు లీడర్ సిహెచ్. ఇందిరాదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు, ఉలవపాడు అంగన్‌వాడీ నాయకులు రావినూతల. గీత తదితరులున్నారు.



ఉలవపాడులో..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఈ నెల 20వ తేదీ జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏ పీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్న పూర్ణమ్మ పిలుపు నిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా మంగళవా రం ఆమె తోటపల్లిగూడూరు మండలం కోడూరు, వరిగొండ ప్రాథమిక ఆ రోగ్య కేంద్రాల పరిధిలోని ఆశా వర్క ర్స్ తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ మండల నాయకులు మధు సూదనమ్మ, రే ణుకమ్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిఐటియు జెండాను అన్న పూర్ణమ్మ ఆవిష్కరించారు. అనంత రం ఆమె మాట్లాడుతూ ఈనెల 20 దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మారుబోయిన రాజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి అన్నపూర్ణమ్మ

వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-ఉలవపాడు : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు చదివించి అనంతరం పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి వెలికితీసే క్రమంలో కుందుడు గుమ్మ అనే ఆటలు ఆడించామని గ్రంథపాలకుడు డి. కోటేశ్వరరావు తెలిపారు.గ్రామంలోని ఇద్దరు బాలికలు 10 వ, తరగతి పరీక్ష ఫలితాలను మండలంలోనే ఎక్కువ మార్కులు సాధించిన ఇద్దరు బాలికలను ఉలవపాడు సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థి కందుల. పూజితా నాగశ్రీ (584) ఉలవపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి నాగళ్ళ. కాజల్ లక్ష్మీ ఆగర్వాల్ (568)మార్కులతో మండలంలో మంచి మార్కులు సాధించి వారి అభినందించారు. పిల్లలకు సుగంధ పానీయాలు అందించారు. 37 మంది విద్యార్థులు హాజరయ్యారు. మోటివేషన్ ఉపాధ్యాయుడు ధన్యాసి. శోభన్ బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు శాఖ గ్రంధాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో విద్యార్థులు మంగళవారం డ్రాయింగ్, క్విజ్ పోటీలు ,తెలుగు సాహిత్యం, గ్రామర్ పోటీల్లో పాల్గొన్నారు. ఫ్యాకల్టీగా ఎ వి ఆర్ మూర్తి నిర్వహించారు. విద్యార్థులు తమ స్నేహితులను కూడా తీసుకొని వచ్చి సమ్మర్ తరగతులలో పాల్గొనే లాగా చేసిన వారికి ప్రత్యేక బహుమతులు ఇస్తారని వివరించినారు.



కందుకూరులో..

పౌరసేవలపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజలకు అందించే పౌర సేవలు గురించి ప్రభుత్వం అనునిత్యం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నందున అత్యంత జాగ్రత్తగా సేవలను అందించాలని సంబంధిత అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ సూచించారు.మంగళవారం తిక్కన ప్రాంగణంలో రీ సర్వే, డిజిటలైజేషన్, నోషనల్ ఖాతాలు, నీటి తీరువా పన్ను వసూలు, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవెన్యూ సంబంధిత విషయాలపై ఆత్మకూరు డివిజన్ తహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎడిఆర్వో ఉదయభాస్కరరావు, ఆర్డిఓ పావని, సర్వే ఎడి నాగశేఖర్ ఉన్నారు.

కళారూపాలకు విశేష స్పందన

నెల్లూరు : సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాలు 2025 కార్యక్రమాల్లో భాగంగా టౌన్‌హాల్‌లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టరు బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర, కళారూపం (నాటకం)కు విశేష స్పందన కనిపించింది. మంగళవారం సాయంత్రం నగరంలోని టౌన్‌హాల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేషన్ కమిషనర్ నందన్ హాజరయ్యారు. ప్రాంగణం కళాబి. మానులతో కిటకిటలాడింది. రాజ్యాంగ రూపకర్త జీవిన విధానాన్ని కళారూపం ద్వారా ప్రదర్శించడం ఆకట్టుకుంది.




నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆశాల సమ్మె నోటీసు



ప్రజాశక్తి-అల్లూరు : మండల పరిధిలోని ఇసుకపల్లి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన్‌కు సిఐటియు జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి మంగళవారం సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20వ తేదీ దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుందన్నారు. కావున ఈ సమ్మెలో అల్లూరు మండలంలోని ఆశ వర్కర్లు అందరూ పాల్గొంటారన్నారు. ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని కనీస వేతనం రూ.26,000 ఇచ్చి పర్మినెంట్ చేయాలని ఒప్పంద జీవోలు అమలు చేయాలని సంక్షేమ పథకాలు వర్తించాలా చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ ఆపాలని ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదని రూ.10లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల ఆశా వర్కర్లు, చిన్ని, పద్మ, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

జెవివి నూతన కమిటీ ఎన్నిక



ప్రజాశక్తి-ఉదయగిరి

స్థానిక షాదీ మందిర్‌లో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ దస్తగిరి అహ్మద్ అధ్యక్షతన మంగళవారం నూతన జన విజ్ఞాన వేదిక మండల కమిటీ 20 మందితో ఏకగ్రంగా ఎన్నుకొన్నారు. మండల అధ్యక్షులుగా షేక్ గాజుల మున్నా, ప్రధాన కార్యదర్శి షేక్ మసూద్ ఎన్నికవగా గౌరవ అధ్యక్షులుగా జిసి ఓబుల్ రెడ్డి, షేక్.నస్రుల్లాను కోశాధికారి కంచుపాటి సురేష్, ఉపాధ్యక్షులుగా సంఘన భాస్కర్ రెడ్డి, షేక్ ఖాజాపీర్, షేక్ దావూద్ కార్యదర్శులుగా అశోక్ మహమ్మద్ అలీ, షేక్ షబ్బీర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కే శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.చక్రపాణి జిల్లా ఉపాధ్యక్షులు బి శ్రీనివాసులు సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అనంతరం పలువురు వారికి అభినంద నలు తెలిపారు. కార్యక్రమంలో జిలాని భాషా, మాల కొండారెడ్డి, జన విజ్ఞాన వేదిక మిత్రులు పాల్గొన్నారు.

మంచిమాట.. జ్ఞాపకాల తోట

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : పిల్లలకు తల్లిదండ్రులు, గురువులు, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు మంచి మాటలు చెప్పడం ద్వారా అనురాగం, అభిమానం ఆప్యాయత, ఆత్మవిశ్వాసం ఏర్పడతాయని సత్యసాయి సేవా ట్రస్ట్ జోనల్ ఇన్చార్జి అండగుండ వెంకట సుబ్బారావు అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా "మంచి మాట... జ్ఞాపకాల తోట" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గాంధీజీ ప్రబోధించిన సత్యం, అహింస, వివేకానందుడి ఆశయాల బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. రాత్రికి రాత్రి ఎవరు మహాత్ములు కారని, ఆలోచన విధానాన్ని మార్చుకోవటం ద్వారా జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగవచ్చని పేర్కొన్నారు. రాత్రి తొందరగా పడుకోవడం, వేకువనే నిద్ర లేవడం, సమయపాలన పాటించడం, పాఠశాలలో చెప్పిన విషయాలను ఎప్పటికప్పుడు ఆకలింపు చేసుకోవడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. నిద్ర లేవగానే తల్లిదండ్రులకు నమస్కారం చేయాలని, గురువులను గౌరవించాలని, ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న మంచి మాటలను పిల్లలచే చెప్పించారు. సుబ్బారావును ఘనంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కె. మంజులత, సేవారత్న గండికోట సుధీర్ కుమార్, యోగా గురువు రాజేంద్ర, ఎర్రయ్య, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-కావలి : కావలిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల (బాలురు) పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మే 20వ తేదీలోగా దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ ఎస్.శ్యామ్‌సుధాకర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మొత్తం 172 ఖాళీలు ఉన్నాయన్నారు. అందులో మూడవ తరగతికి 40 సీట్లు ఉండగా, ఎస్‌సి-5, ఎస్‌టి -32, బిసి- 2, ఒసి- 1, మిగిలిన 32 సీట్లు ఎస్.టి.లకు కేటాయించడం జరిగిందన్నారు. కేవలం ఎస్.టి. కేటగిరిలో 4 తరగతికి -35 ఐదవ తరగతికి -34, 6వ తరగతికి -29 7వ తరగతికి -9, 8వ తరగతికి -16, 9వ తరగతికి -9 సీట్లు లెక్కన ఎస్‌టి కేటగిరీలో ఖాళీలు ఉన్నాయన్నారు. గురుకుల పాఠశాలలో చేరాలనుకున్న వారి ఆదాయం సంవత్సరానికి లక్ష రూపాయలకు మించరాదన్నారు. 4వ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లలో అర్హత కలిగిన ఎస్‌టి విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఖాళీల సంఖ్య కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ తీస్తామని చెప్పారు. మరిన్ని వివరాలుకు కావలి వెంగళరావు నగర్‌లోని ఏపి గిరిజన సంక్షేమ గురుకుల (బాలురు) పాఠశాల లో సంప్రదించాలని తెలిపారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి : హ్యాపీ సేవా సంస్థ ఉపాధ్యక్షుడు విజయ్.దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి పట్టణ ఇందిరానగర్ 22వ వార్డులో నివాసం ఉంటున్న కసుకుర్తి. ప్రతాప్ అనే దివ్యాంగ కుటుంబా నికి రైస్ బ్యాగ్‌తో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్. ఫనిబాషా మాట్లాడుతూ కసుకుర్తి ప్రతాప్ సతీమణి కసుకుర్తి. లలితకు ఇటీవల ఫీట్స్ వచ్చి నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేరి 20 రోజులు చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారని వారికి పలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని వెంటనే హ్యాపీ సేవా సంస్థ ఆకుటుంబానికి అన్నివిధాలుగా అండగా నిలుస్తుందన్నారు. ఈ రోజు హ్యాపీ సేవా సంస్థ ఉపాధ్యక్షుడు విజయ్ దాతృత్వం ఎంతో అభినందనీయమని సంస్థ సభ్యులందరూ ఇదేవిధంగా సాయమందించాలని ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని కలిగి వుండాలన్నారు. తదుపరి విజయ్‌కు హ్యాపీ సేవా సంస్థ సభ్యులు జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్.ఫనిబాషా, ఉపాధ్యక్షుడు విజయ్.దేవరకొండ, సంస్థ సలహాదారులు ప్రభుద్యభరత్, సంజయ్ తదితరులున్నారు.

ఆశా కార్యకర్తల సమావేశం



ప్రజాశక్తి-అనంతసాగరం : చిలమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరుగుతున్న ఆశ కార్యకర్తల సమావేశాన్ని డాక్టర్ ఎస్‌కె ఖాదర్ వలీ, డిఎల్‌ఎటిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా జరుగు ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత్ అభియాన్ కార్యక్రమానికి గర్భిణులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని రావాలని, వారి అన్నిరకాల పరీక్షలు చేయించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే జరపాలని, దగ్గుతో బాధపడుతున్న వారిని గళ్ళ పరీక్షలు చేయించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు జరిగేటట్లు చూడాలని, తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.జ్యోతి రాణి, సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు, ఎం.పి.హెచ్.ఎ.మేల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో మండల పరిధిలోని హిందూ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాణ్యా సేకరణ కర్త ఎమ్‌డి వాయిస్, పోస్ట్‌మాన్ ఉమేష్ సందర్శించారు. ఆదరణ పిల్లలకు నీతి కథలు చేతితో కథల బొమ్మ గీతాలు జానపద గేయాలు నేర్పించారు. అనంతరం పిల్లలకు విజ్ఞాన్ పోటీల్లో పాల్గొని వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. సమ్మర్ క్యాంప్ కార్యక్రమానికి తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించి సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఓ. శ్రీనివాస రావు తెలియజేశారు.

'సంయుక్త'లోని పిల్లలకు భోజనం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం ఇందిరా నగర్ నివాసులు మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు - రేవతి దంపతుల కుమార్తె చిన్నారి గంధం.పూర్ణ్యం పుట్టినరోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు మంగళవారం విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దాత గంధం ప్రసన్నాంజనేయులు, బాలు క్రిష్టియన్ నిర్వాహకులు బాబు, సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించి చేశారు.

బాలికా వికాసంపై అవగాహన



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని పెద్దబ్బీపురం గ్రామపంచాయతీలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోరి బాలిక వికాసం ప్రోగ్రామ్ ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.కస్తూరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మాట్లాడుతూ మహిళా సాధికారత, సుస్థిర, ఆరోగ్యం, జ్ఞానం, బాల్య వివాహాల అరికట్టడం, లైంగిక వేధింపులు, కౌమారద బాలబాలికల సమస్యలు, పిల్లల సంరక్షణ మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నరసమ్మ, ఎసిడి సెక్టర్ అంగన్వాడీ వర్కర్లు, సిబ్బంది బి.లక్ష్మీదేవి, ఎ.సుదర్శనమ్మ గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూసేసిన కేసుపై విచారణ అన్యాయం

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

2020లో అప్పటి కావలి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పెట్టిన ఫైలాన్ కూల్చివేత కేసును పోలీస్ అధికారులు విచారించి, కేసును మూసివేస్తే, అదే కేసును 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు అత్యుత్సాహం చూపి, మళ్లీ తెరచి, మాజీ ఎం.ఎల్.ఎ.తో పాటు 7 మంది వైసిపి నాయకులు, మరో 7మంది విలేకరులతో కేసు పెట్టారని వైసిపి జిల్లా కార్యదర్శి నెల్లూరు వెంకటేశ్వర్లు రెడ్డి విమర్శించారు. ఈ కేసులో నలుగురు విలేకరులను అక్రమంగా రిమాండ్‌కు పంపారని అయన ఆరోపించారు. మంగళవారం మాజీ ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసంలో అయన ఆదేశాల మేరకు వైసిపి నాయకులు విలేకరుల సమావేశం జరిపి, అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండించారు. 2024 ఎన్నికల్లో ఓడిపోయినా గానీ, ప్రజాసమస్యలపై స్పందిస్తున్నారనే కోపంతో టిడిపి నాయకులు కావలిలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతున్నారని, ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమకేసులు పెట్టి బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఏవేవో కేసులు పెట్టి, వైసిపి నాయకులను ఆందోళనకు గురి చేసి, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతిపక్షాలు పోటీ చేయకుండా భయానక వాతావరణం సృష్టించేందుకే టిడిపి ప్రభుత్వం పోలీస్ రూలింగ్ చేస్తుందని వెంకటేశ్వర్లు రెడ్డి ఆరోపించారు. జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు ఎంఎల్‌ఎనుద్దేశించి మాట్లాడుతూ కావలిని కాపు కాస్తానని చెప్పి, కక్ష రాజకీయాలకు తెర లేపుతున్నారన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలపై పెట్టే ఆక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని, వాటిని న్యాయంగా ఎదుర్కొంటామన్నారు. ప్రెస్‌మీట్లో బోగోలు వైసిపి అధ్యక్షులు మద్దిబోయిన వీరరఘు, వైసిపి ఎస్.సి. సెల్ అధ్యక్షులు, అధికార ప్రతినిధి పందిటి కామరాజు (సురేష్), మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి కామయ్య, కలికి శ్రీనివాసులురెడ్డి, కొమరి రాజు, పేరం వెంకటేశ్వర్లు, ఏ.కే. సుందరరాజ్, గుడ్లూరు మాల్యాద్రి, ఎగురు చినపుల్లయ్య, వెంగాళశెట్టి కళ్యాణి, తదితర నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెనోటీసు

ప్రజాశక్తి-కావలి



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సిఐటి యు అనుబంధ మున్సి పల్ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్‌కు సిఐటియు ఆధ్వర్యంలో ఎపి మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్మికులు సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు చాలా రోజుల నుంచి పరిష్కారం కాలేదని గత సంవత్సరం 16 రోజుల సమ్మె కాలంలో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నిటినీ పరిష్కరించాలని మూడు రోజులు సమ్మెను కొనసాగిస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అప్కాస్ రద్దు చేసే, ఆలోచన విరమించుకొని మున్సిపల్ కార్మికులు అందర్నీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మికుల వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనెఫిట్స్ గ్రాడ్యూటీ చెల్లించాలని గత 17 రోజుల సమ్మెకు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నాయకులు తురక సీనయ్య, ఎం.పొలయ్య, క్రాంతి కుమార్, జే బాబు, ఎం.భాస్కర్, ఒంగోలు రమేష్, తదితర కార్మికులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడిగా రాజుపాలెం యువకుడు

ప్రజాశక్తి-మర్రిపాడు



మండలంలోని చుంచులూరు రాజుపాలెం గ్రామానికి చెందిన యల్లంరాజు మోహన్‌రాజు, ఉమారాణి (మాజీ ప్రజాశక్తి విలేకరి కుమారుడు) దంపతుల కుమారుడు రాకేష్ వర్మ సినీ దర్శకుడిగా అరంగ్రేటం చేయనున్నారు. నవీన్‌చంద్ర, రాశిసింగ్ హీరో హీరోయిన్‌లుగా, రవివర్మ, గాయత్రి భార్గవి ప్రధాన పాత్రధారులుగా, రామకృష్ణ వీరపనేని నిర్మాణ సారథ్యంలో బ్లైండ్ స్పాట్ సినిమాతో రచయిత, దర్శకునిగా ఆరంగేట్రం చేశారు. ఈ సినిమా మే 9న విడుదల కానుంది. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన రాకేష్ వర్మ సినిమా డైరెక్షన్‌పై మక్కువతో హైదరాబాద్‌లోని ప్రముఖ దర్శకుడు ఉమామహేశ్వరరావు సారథ్యంలోని దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో డైరెక్టర్‌గా శిక్షణ పొందాడు. అనంతరం పలు షార్ట్ ఫిలింలకు దర్శకత్వం వహించారు. వాటిలో పానీపూరి అనే షార్ట్ ఫిలింకు జాతీయస్థాయి అవార్డు రావడంతో యువి క్రియేషన్ వారు అతని ప్రతిభను గుర్తించి బ్లైండ్ స్పాట్ సినిమాకు దర్శకుడుగా అవకాశం కల్పించారు. రాకేష్‌వర్మ దర్శకత్వంలో తొలి చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో రాజుపాలెం, చుంచులూరు, పడమటి నాయుడుపల్లి తదితర గ్రామాల ప్రజలు అభినందనలు తెలియజేస్తూ, ఈ సినిమా విజయం సాధించాలని, రాబోయే రోజుల్లో రాకేష్‌వర్మ గొప్ప దర్శకుడు రాణించాలని కోరుకుంటున్నారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట


వేసవి తాపాన్ని అధిగమించేందుకు బోగోలు బజాజ్ సెంటర్ ఇబ్రహీంపేట బజార్ సెంటర్‌లో ప్రభుత్వం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మే లో ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో దాహానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోగోలు బజార్ ఇబ్రహీంపేట చిన్నబజారు సెంటర్లో కూరగాయలు నిత్యవసర వస్తువులు కోసం వచ్చిన వారికి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూల్ డ్రింక్స్‌తో వేసవి తాపాన్ని తెచ్చుకుంటున్నారు ఎన్ని కూల్డ్రింక్స్ తాగినా కూడా దాహం తీరడం లేదని ప్రజలు వాపోతున్నారు ప్రభుత్వం ఉన్నత అధికారులు చిన్న బజార్ పెద్ద బజార్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం పంచాయతీ సిబ్బంది చలివేంద్రాన్ని ఏర్పాటు చేసేదిని ఈ సంవత్సరం చలివేంద్రాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆఫ్రాన్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అనంతసాగరం



సోమశిల జలాశయం కింది భాగం ఉన్న ఆఫ్రాన్ మొత్తం దెబ్బతిని ఉందని, వెంటనే మరమ్మతులు చేసి సోమశిల జలాశయంను కాపాడాలని, లేకుంటే గతంలో సోమశిలలో ఒక జలాశయం ఉండేదని పిల్లలు చరిత్ర పాఠాలలో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని సిపిఎం నాయకులు వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి సోమశిల జలాశయం నుంచి పరిశీలించి త్వరగా ఆఫ్రాన్ పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు కానీ ఇంతవరకు పనులు పూర్తి కాలేదన్నారు. ఈ జలాశయం వల్ల జిల్లా ప్రజలకు సాగునీరు, తాగునీరు, జల విద్యుత్తు అందుతున్నా యని తెలిపారు. ఈ సంవత్సరం భారీ వర్షాలు కురిస్తే సోమశిల జలాశయం మొత్తం నాశనమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దెబ్బతిన్న సోమశిల జలాశయం పనులను సిపిఎం జిల్లా నాయకత్వం పరిశీలించి దెబ్బతిన ఆఫ్రాన్ పనులు పూర్తి చేసి జలాశయంను కాపాడాలని సిపిఎం జిల్లా, మండల కమిటీల తరపున మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి విన్నవిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా మంత్రులు స్పందించి సోమశిల జలాశయం ఆఫ్రాన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేసి సోమశిల జలాశయంను కాపాడాలని సిపిఎం నాయకులు కోరారు.



యువ దర్శకుడికి మంత్రి అభినందనలు

ప్రజాశక్తి-మర్రిపాడు

బ్లైండ్ స్పాట్ సినిమాతో దర్శకుడుగా పరిచయం కాబోతున్న చుంచులూరు రాజుపాలెం గ్రామానికి చెందిన ఆనం కుటుంబ ఆత్మీయుడైన యల్లంరాజు మోహన్ రాజు కుమారుడు రాకేష్ వర్మకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ సినిమా విజయవంతం కావాలని రాకేష్ వర్మ గొప్ప దర్శకుడుగా రాణించాలని ఆకాంక్షించారు.

ఈ-శ్రమ కార్డులు అందజేత

ప్రజాశక్తి కోవూరు



అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు జిల్లా సేవా అధికార సంస్థ కార్యదర్శి మంగళవారం ఈ శ్రమ్ కార్డులను అందించారు. ఆమె నెల్లూరు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోవూరు సాయిబాబా గుడి దగ్గర నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం మే 1వ తేదీన జరుపుకునే స్మారక దినం మే డే అన్నారు. అనంతరం ఆమె కోవూరు శ్రీనివాస ఫ్లై యాష్ బ్రిక్స్ లో పని చేస్తున్న కార్మికులను విచారించారు. అసంఘటత రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు కు ఎనిమిది గంటల పని దినాలు కల్పించాలన్నారు. కార్మికులంతా ఈ శ్రమ కార్డులను కలిగి ఉంటే ప్రభుత్వం కల్పిస్తున్న ప్రమాద బీమా పథకాలు వస్తాయన్నారు. పేదలు మహిళలు వికలాంగులు ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్మికులకు ఏదైనా అవసరమైతే 15100 కి ఫోను చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ పీ అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం పిల్లలకు ఖత్నాలు

ప్రజాశక్తి - ఉదయగిరి

స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణంలో రహమతుల్ ఆలమిన్ ట్రస్ట్, చిన్న మసీదు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వందమంది పిల్లలకు ఒడుగుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు చుట్టుపక్కల మండలాల నుండి వచ్చిన 100 మంది ముస్లిం పిల్లలకు ఒడుగులు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా జనవిజ్ఞాన వేదిక నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్ పాల్గొని మాట్లాడుతూ చిన్న మసీదు కమిటీ వారు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలు కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేయడము చాలా అభినందనీయమని కొనియాడారు. వీరు ఇదేవిధంగా భవిష్యత్తులో కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వెనుక బడిన ఈ ప్రాంతంలో ఏ ఆసుపత్రిలో చూసిన ఖత్నా , ఒడుగులు చేసే అవకాశం లేక వేరే ప్రాంతాలైన నెల్లూరు ఆత్మకూరు తదితర ప్రాంతాలకు వెళ్లి ఒడుగులు చేయించుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న విషయమని 20వేల ఖర్చు తో చేయించుకోవాలంటే కష్టమని చిన్న మసీదు కమిటీ వారు రహమతుల్లా ఆలమె ట్రస్ట్ వారు ఉచితంగా అందరికీ ఒడుగుల కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం అని అందరూ వారిని ఆదర్శంగా తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆటో డ్రైవర్లకు న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి



హైకోర్టు ఆదేశాలమేరకు కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.గీతవాణి సూచనలు మేరకు కావలిమండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో తుమ్మలపెంట రోడ్డు కూడలి అంబేద్కర్ పార్కు వద్ద ఉన్న ఆటో డ్రైవర్స్ దగ్గర మేడే వారోత్సవాలలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇసకలసాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ విధిగా లైసెన్సు కలిగి ఉండాలని, తాము నడుపుతున్న ఆటోలకు ఇన్సూరెన్స్ చేయాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిప రాదని, లైసెన్సు, ఇన్సూరెన్స్ వుంటే ప్రమాదం జరిగి నప్పుడు సదరు ఇన్సూరెన్స్ కంపెనీలపై జిల్లా కోర్టులలో ఎం.వి.ఒ.పి. కేసులు వేసుకుని నష్ట పరిహారం పొంద వచ్చని సాయిప్రసాద్ ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఆటో డ్రైవర్స్ కు పప్రయాణికులకు తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఉచితంగా న్యాయ సహాయం లోక్ అదాలత్ ద్వారా పొంద వచ్చని, ఆటోలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్, ప్రయాణికులు పాల్గొన్నారు.



సచివాలయంలో పరిశీలన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని కావలి ఎడవల్లి గ్రామ సచివాలయాన్ని మాజీ తెలుగు యువత నాయకులు ఏలూరి మాల్యాద్రి నాయుడు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బంది హాజరు, ఎంతమంది ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్నారని, సెలవులపై వెళ్లినవారు ఎంతమంది, ఖాళీల సంఖ్య తదితర వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము సందర్శించిన సమయంలో సచివాలయ సిబ్బంది వారివారి విధులలో నిమగ్నమై ఉండటాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం సచివాలయంలో ఏడు మంది విధులు నిర్వహించాల్సి ఉండగా ఒకరు సెలవు పెట్టడంతో ఆరు మంది 10 గంటల 30 నిమిషాలకు సచివాలయానికి వచ్చారని తెలియజేశారు. అదేవిధంగా మండలంలోని పలువురు టిడిపి నాయకులు సచివాలయాలకు వెళ్లిన సందర్భంలో కేవలం ఖాళీ కుర్చీలు దర్శనమిస్తూ అరాకొర కొంతమంది మాత్రమే విధులకు సక్రమంగా వస్తున్నారని, మిగతా వారు పనితీరును, మెరుగు పరుచుకుని సమయానికి విధులకు వచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలియజేశారు.

వైద్య సిబ్బంది నిరసన

ప్రజాశక్తి-వరికుంటపాడు




నిరసన తెలియజేస్తున్న వైద్య సిబ్బంది

ఎంఎల్‌హెచ్‌పిలు వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బంది మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిహెచ్ఒ రాజశేఖర్ రాజు మాట్లాడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం వారు చేస్తున్న ఆందోళన వారి సమస్యల కోసమే వినియోగించుకోవాలి కానీ ఇతర సిబ్బందిని హేళన చేసి మాట్లాడటం సమంజసం కాదన్నారు. వారి వ్యాఖ్యలను తామందరం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకోజి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం





వంజివాక వెంకోజి సిపిఎంకు అందించిన సేవలు చిరస్మరణీయమని మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం, దామరమడుగు గ్రామపంచాయతీ ఆర్ఆర్ నగర్‌లోని ఆయన స్వగృహంలో అనారోగ్యం కారణంగా మంగళవారం వేకువజామున తుది శ్వాస విడిచారు. వెంకోజి(80) ఆయన సతీమణి నిర్మలమ్మ నాలుగేళ్ల క్రితం మృతిచెందారు.ఆయనకు నలుగురు కుమారులు సిపిఎంలోనే కొనసాగుతున్నారు. 3వ కుమారుడు కృష్ణ ప్రసాద్ ఆర్ ఆర్ నగర్ కాలనీకి కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 1976 లో సిపిఎంలో సభ్యునిగా ఆయన ఎంపికయ్యారు. దామర మడుగు గ్రామంలో ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనేవారు. 1967 -68 లో జరిగిన కూలీ పోరాటాలలో తన వంతు పాత్ర ఉండేది. 1983లో జక్కా వెంకయ్య సూచనల మేరకు ఓటదొరువు ప్రాంతంలో 7 ఎకరాల పొలాన్ని ఇళ్ల స్థలాలకు కేటాయించగా ఆ స్థలాలను అందరికీ పంచిపెట్టి ఆ ప్రాంతానికి డాక్టర్ రామచంద్ర రెడ్డి పేరు ఖరారు చేయడంలో ఆయనప్రధాన పాత్ర పోషించారు. పార్టీ సలహా మేరకు ఆయన అక్కడే నివాసం ఏర్పరచుకొని అక్కడ పార్టీ శాఖ బాధ్యతలు నిర్వహించారు . అక్కడ శాఖ బాధ్యతలు నిర్వహించడంలోనూ వ్యవసాయ కార్మిక సంఘాన్ని కొనసాగింపడంలో ప్రధాన పాత్ర పోషించారు. గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ గా, ఎంపీటీసీ మెంబర్ గా ఉండి మండల పరిషత్, గ్రామ పంచాయతీ ద్వారా ప్రజాప్రతినిధులుగా సేవలందించారు. ప్రధానంగా వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీ బాధ్యత, మండల కమిటీ బాధ్యత వహించి పూర్తి అంకితభావంతో కార్మికుల పక్షాన నిలబడి కూలి రేట్లు నిర్ణయించడం అమలు జరపడంలో ఆయనది ముఖ్య భూమిక. దామర మడుగు కూలి పోరాటాల ఉద్యమంలో ఆయన రహస్య జీవితం గడిపారు. వెంకోజి సుదీర్ఘ ప్రయాణంలో 50 సంవత్సరాలు పాటు కమ్యూనిస్టు పార్టీ నిబంధనలకు లోబడి చివరి వరకు పార్టీ కోసం సేవలందించారు. వ్యకాసం. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమరాజు, మంగళ పుల్లయ్య, మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, దామరమడుగు శాఖ కార్యదర్శి గరికపాటి సురేష్, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు చలంచర్ల రత్తయ్య, ఆర్ఆర్ నగర్ శాఖ, మరికొందరు సిపిఎం నాయకుల సమక్షంలో ఆయన భౌతికకాయాన్ని ఎర్ర శాలువాను కప్పి పూలమాలలతో సత్కరించి సంతాపం తెలియజేశారు. 7వతేదీ బుధవారం ఉదయం 9 గంటలకు ఆర్ ఆర్ నగర్ లోని ఆయన స్వగృహంలో అంత్యక్రియలు జరుగునని తెలిపారు.